జైపాల్‌రెడ్డి పేరుతో సెమినార్ హాల్ నిర్మించాలి



వృథాగా మారిన ఐసీఎస్ఎస్ఆర్ సెమినార్ హాల్

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీలో కేంద్ర మాజీ మంత్రి, పూర్వ విద్యార్థి దివంగత నేత జైపాల్‌రెడ్డి పేరుమీద సెమినార్ హాల్ నిర్మించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. వర్సిటీ లైబ్రరీలోని ఖాళీగా ఉన్న పాత ఐసీఎస్ఎస్ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషయిల్ సైన్స్ రీసెర్చ్ సౌత్రన్ రీజినల్ సెంటర్) సెమినార్ హాల్‌కు మరమ్మతులు చేయించి జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలన్నారు. లైబ్రరీ భవనంలోని రెండో అంతస్తులో 1973లో స్థాపించిన ఐసీఎస్ఎస్ఆర్‌ను ఏళ్ల తర్వాత ఓయూ సీపీపీకి (పాత పేరు ఇండో అమెరికన్ స్టడీస్ సెంటర్ భవనం) ఏడాది క్రితం తరలించారు. ఐసీఎస్ఎస్ఆర్ హాల్లో తరుచూ జరిగే సభలు, సమావేశాల కారణంగా లైబ్రరీలో చదివే విద్యార్థులకు అంతరాయం ఏర్పడుతుందనే ఉద్దేశంతో ఓయూ సీపీపీకి తరలించిన విషయం విదితమే. కానీ హాలును మాత్రం వర్సిటీ లైబ్రరీకి ఐసీఎస్ఎస్ఆర్ అధికారులు అప్పగించగా ఏడాదిగా నిరుపయోగంగా ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ నాయకులు పాల్గొని ప్రసంగించిన ఓయూలోని ఐసీఎస్ఎస్ఆర్ హాల్‌ను వృథా కాకుండ మరమ్మతు చేయించి ఆధునిక హంగులతో పునఃనిర్మాణం చేపట్టి జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

కార్మిక శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తా



డీవీ రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

సనత్‌నగర్: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ (ఎస్‌సీఆర్ఈఎస్) సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా డీవీ రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన సికింద్రాబాద్ లోకో రన్నింగ్ స్టాఫ్ బ్రాంచ్ సెక్రటరీగా ఉన్నారు. ఎన్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య నేతృత్వంలో జరిగిన సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ 226వ వర్కింగ్ కమిటీ సమావేశంలో డీవీ రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతలను నిస్వార్థంగా నిర్వర్తించి రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ పేరు ప్రతిష్ఠలను మరింతగా పెంచనున్నట్లు చెప్పారు. కార్మిక శ్రేయస్సే ధ్యేయంగా అంకిత భావంతో పనిచేస్తానని చెప్పారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను తనకు అప్పగించినందుకు జాయింట్ జనరల్ సెక్రటరీ భరణి భానుప్రసాద్‌కు, సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ ప్రభురాజుకు కృతజ్ఞతలు అన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత



స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పోలీస్ బందోబస్తు

సనత్‌నగర్: ఓటరు తీర్పు ఈవీఎంలలో భద్రంగా ఉంది. అభ్యర్థుల తలరాతలు మార్చే ఈవీఎంలకు భారీ కాపలా కొనసాగుతోంది. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ నెల 13న జరిగిన సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రాంగణంలో భద్రపరిచారు. ఈ నియోజకవర్గంలోని 229 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలకు సాయుధ బలగాలతో భద్రత కల్పించారు. స్ట్రాంగ్ రూమ్‌లతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో సాయుధ బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు..ఇలా మూడంచెల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. షిఫ్టుల పద్ధతిలో దాదాపు 200 మంది పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహిస్తున్నారు. పెట్రోలింగ్ వాహనాలు, బ్లూకోల్ట్స్ టీమ్‌లు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నాయి. డీసీపీ, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ల స్థాయి అధికారులు ప్రతిరోజూ స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల లోపల, వెలుపల అడుగడుగునా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఆర్పీఎఫ్ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

చిలకలగూడ: రైల్వే రక్షకదళ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని అసోషియేషన్ ప్రతినిధులు తెలిపారు. చిలకలగూడలోని సికింద్రాబాద్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ (ఆర్పీఎఫ్‌పీడబ్ల్యూఏ) కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెన్షనర్ అసోషియేషన్ ఆఫ్ రైల్వేస్ (పీఏఆర్) జోనల్ ప్రెసిడెంట్ నారాయణ, కార్యదర్శి విద్యాసాగర్ ముఖ్య అతిథులుగా హాజరై మెడికల్ కార్డు అప్‌గ్రేడేషన్ (యుఎంఐడీ కార్డు), నేషనల్ పెన్షనర్స్ బ్యాంకు అకౌంట్ అంశాలపై అవగాహన కల్పించారు. అధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి, జనరల్ సెక్రటరీ జీఎస్ రాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వీ.ముత్యాలు, పీఏఆర్ మల్కాజ్‌గిరి బ్రాంచ్ ప్రతినిధులు గురుమూర్తి, టీకేసింగ్, అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జంబో ఆఫర్లు ప్రకటించిన రాయల్ ఓక్

బంజారాహిల్స్: ఆకర్షణీయమైన, ఫంక్షనల్ ఫర్నిచర్‌లో అగ్రగామిగా ఉన్న రాయల్ ఓక్ ఫర్నిచర్ బంజారాహిల్స్, కూకట్‌పల్లి, అత్తాపూర్, రామచంద్రాపురం, నేరెడ్‌మెట్, వనస్థలిపురంలలో ఉన్న స్టోర్‌లలో 70 శాతం వరకు తగ్గింపుతో జంబో ఆఫర్లను ప్రకటించింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని రాయల్ ఓక్ షోరూంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ రీజినల్ మేనేజర్ నరేష్ ఒబిలిశెట్టి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కస్టమర్లను దృష్టిలో పెట్టుకొని సరికొత్త డిజైన్, నాణ్యమైన శ్రేణితో కూడిన గృహాలంకరణ ఉత్పత్తులపై ఈ అద్భుతమైన తగ్గింపును ఇస్తున్నామన్నారు. ఇక్కడ సోఫాలు కేవలం రూ. 19,000లతో ప్రారంభం అవుతాయన్నారు.



కంపు కొడుతుంది సారూ..
పరిష్కరించాలి మీరూ!

బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ ప్రధాన రహదారిలో డ్రైనేజీ మురికినీరు స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. నిత్యం రోడ్డుపై డ్రైనేజీ మురికినీటి ప్రవాహం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి అధికారుల ఉదాసీనత పాదచారులు, వాహనచోదకులకు గుదిబండగా మారుతోంది. పద్మారావునగర్ ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలోని చౌరస్తాలో నిత్యం డ్రైనేజీ మురికినీరు ఏరులై పారుతుంది. మురికినీరు ప్రవహించే ప్రాంతం జలమండలి శ్రీనివాస్ నగర్, బోయిగూడ సెక్షన్ కార్యాలయాల సరిహద్దు కావడంతో ఈ సరిహద్దు మాదంటే మాది కాదంటూ సదరు సిబ్బంది చెబుతుండటంతో సమస్య తీవ్ర రూపం దాల్చుతోంది. సమస్యను తీర్చాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. –పద్మారావునగర్



ఆసనాలు వేస్తున్న చిన్నారులు

వేసవి శిక్షణ శిబిరాలు..
చిన్నారుల కసరత్తులు!

- కిక్కిరిసిపోతున్న మైదానాలు
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు



సనత్‌నగర్: వేసవి క్రీడా శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గత నెల 24 నుంచి ప్రారంభమైన శిబిరాలు బాలల్లో ఉత్తేజాన్ని నింపుతున్నాయి. సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని స్పోర్ట్ కాంప్లెక్స్, అమీర్‌పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లతో పాటు క్రీడా మైదానాల్లో కొనసాగుతున్న శిక్షణ శిబిరాలకు హాజరయ్యే చిన్నారులతో కోలాహలంగా మారాయి. వేసవి సెలవుల్లో ఆటపై పట్టు సాధించడంతో పాటు దేహదారుఢ్యం కూడా పెంపొందుతున్న భావనతో తల్లిదండ్రులు సైతం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తమ పిల్లలను ప్రత్యేక క్రీడా శిబిరాలకు పంపిస్తున్నారు. క్రికెట్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, హాకీ, స్కేటింగ్, జిమ్, బ్యాడ్మింటన్, కరాటే, యోగా ఇలా పలు రకాల ఆటల్లో చిన్నారులు కసరత్తు చేస్తున్నారు. పిల్లల్లోని ఆసక్తిని గమనించి కోచ్‌లు సైతం తగిన ప్రోత్సాహాన్ని అందించి ఆటలో వారిని రాటుదేలేలా చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. చాలామంది జాతీయ స్థాయి క్రీడాకారులు మొదట తమ క్రీడా శిక్షణ పునాది వేసవి శిక్షణ శిబిరాల్లోనే పడడంతో వారిని స్ఫూర్తిగా తీసుకోవాలంటూ కోచ్‌లు చిన్నారుల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచే క్రీడా ప్రాంగణాలు బాల క్రీడాకారులతో కిక్కిరిసిపోతున్నాయి.



క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండ 26, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 70, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 28, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 70, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 8, మునగకాయ 3–4, ముల్లంగి 4–5.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. బీసీల ఓట్లతోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ అమలు చేసి మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులలో అధికంగా ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

గురుపూజ మహోత్సవం ప్రారంభం

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో 115వ ఆరాధన గురుపూజ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సదానందాదార్యుల ఆధ్వర్యంలో మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ ఉత్సవాలు ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతాయని చివరి రోజు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామి ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

వరదనీటి పైప్‌లైన్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి చౌరస్తా నుంచి సుభాష్‌చంద్రబోస్‌నగర్ వరకు నూతనంగా నిర్మిస్తున్న వరదనీటి పైప్‌లైన్ పనులను బుధవారం కార్పొరేటర్ సామల హేమ పరిశీలించారు. పాత పైప్‌లైన్‌లో మట్టి పూడిక ఏర్పడడంతో వర్షాకాలంలో ఆయా ప్రాంతాలను ముంచెత్తి వరదనీరు ఇళ్లలోకి చేరుతుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో సుమారు రూ. 17 లక్షల వ్యయంతో వరదనీటి పైప్‌లైన్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయగా నిధులు మంజూరు కావడంతో పనులు చేపట్టామని హేమ వివరించారు. చిలకలగూడ నుంచి సీతాఫల్‌మండి ప్రధాన రహదారికి ఆనుకుని చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణ సమయంలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగిన ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఈఎస్ఐ, ఆల్విన్, బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 7.30 వరకు శ్రీనివాసకాలనీ ఈస్ట్, 2ఆర్‌టీ, ఎస్ఆర్‌నగర్ బస్టాప్ వెనుక ప్రాంతం, గాయత్రీనగర్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ నివాస ప్రాంతం, ఉదయ్‌నగర్, ఎస్ఆర్‌టీ, హిందూ పబ్లిక్ స్కూల్, హనుమాన్ టెంపుల్. ఉదయం 7.30 నుంచి 8 గంటల వరకు బాపూనగర్, జస్టిస్ రమణ నివాస లేన్, అప్పర్ వాటర్ ట్యాంక్, ఆంధ్రాబ్యాంక్ లేన్, ప్రేమ్‌నగర్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు. ఉదయం 8 నుంచి 8.30 వరకు అమీర్‌పేట డీకే రోడ్డు, మాజీ గవర్నర్ రోశయ్య నివాస లేన్, శివబాగ్‌కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

19న బొడ్రాయి వార్షికోత్సవం

లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో ఈనెల 19న నాభిశిల బొడ్రాయి వార్షికోత్సవం వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బస్తీ పెద్దలంతా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. 19న ఉదయం 6 గంటలకు శీతలాదేవి నాభిశిల బొడ్రాయికి జలాభిషేకంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం 7 గంటలకు పంచామృత స్నానాభిషేకం, 8కి చంద్రపటం, 9 గంటలకు అఖండ జ్యోతులు, 10 గంటలకు దిష్టికుంభం, అనంతరం బైండ్ల కళాకారుల ఆధ్వర్యంలో శీతలాదేవి బొడ్రాయి కథ, మధ్యాహ్నం ఒంటి గంట పోతరాజుల విన్యాసాలు, బోనాలు, మంగళహారతులు తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఎట్టకేలకు స్విమ్మింగ్ పూల్ సిద్ధం



ఉస్మానియా యూనివర్సిటీ: ఎట్టకేలకు ఓయూ స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభానికి సిద్ధం చేశారు. మరమ్మతుల కారణంగా ఈ వేసవిలో మూసివేసిన పూల్‌ను విద్యార్థి నాయకుల ఒత్తిడి మేరకు ప్రారంభించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. త్వరలో ప్రారంభం కానున్న స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టాలనుకునే వారు దరఖాస్తులు చేసుకోవచ్చని ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేకుమార్ తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



భూక్య సురేష్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ (ఇన్ఫర్మేటిక్స్) విభాగం నుంచి భూక్య సురేష్ సురేష్ పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.శ్యామ చంద్రప్రసాద్ పర్యవేక్షణలో సెక్యూరిటీ అండ్ ఎనర్జీ బెస్ట్ పాత్ రౌటింగ్ ప్రొటోకాల్ ఇన్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్స్ ఫర్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అప్లికేషన్స్ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు. ఓయూ పరిధిలోని సికింద్రాబాద్ పీజీ కాలేజీలో అధ్యాపకుడిగా పని చేస్తున్న సురేష్ తన పీహెచ్‌డీ డాక్టరేట్‌ను తన తల్లిదండ్రులు దివంగత భూక్య చందర్, సాలవ్వకు అంకితమిస్తున్నట్లు తెలిపారు. కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.రవికుమార్‌తో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు సురేష్‌కు అభినందనలు తెలిపారు.

టీవీ సీరియల్ మేకప్‌మెన్ హత్య

కార్మికనగర్‌లోని నిమ్స్‌మే మైదానంలో ఘటన



చెన్నయ్య(ఫైల్)

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని నిమ్స్‌మే మైదానంలో మంగళవారం రాత్రి ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు... కార్మికనగర్ చిల్లా వద్ద పక్కన ఉన్న నిమ్స్‌మే మైదానం లోపల గోడ వద్ద పడివున్న యువకుడి మృతదేహాన్ని గుర్తించిన నిమ్స్‌మే సెక్యూరిటీ సిబ్బంది బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, బోరబండ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడు టీవీ సీరియల్స్ మేకప్‌మెన్‌గా పనిచేసే మహబూబ్‌నగర్ వనపర్తి ప్రాంతానికి చెందిన చుక్కా చెన్నయ్య అలియాస్ తరుణ్‌తేజ(28)గా గుర్తించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మారణాయుధాలతో దాడి జరుగున్న క్రమంలో మృతుడు గాయాలతో పరిగెత్తి గోడ వద్ద కుప్పకూలి పోయి ఉంటాడని పోలీసులు అంచనాకు వచ్చారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి మృతుడు చెన్నయ్యతో పాటు ఎంత మంది నిమ్స్ మే మైదానంలోని వచ్చారు? ఎలా వచ్చారు? అనే వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. కార్మికనగర్, బస్ స్టాప్, కార్మికనగర్ శ్రీరాంనగర్ ఉన్న సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఓటింగ్ సరళిపై దానంకు నివేదన

వెంకటేశ్వరకాలనీ: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో ఈ నెల 13న జరిగిన ఓటింగ్ సరళి ఇతరత్రా అంశాలపై బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ బి.భారతీనాయక్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ సీనియర్ నాయకుడు సి. రాములుచవాన్ నివేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో 50.33 శాతం పోలింగ్ నమోదైందన్నారు. వివిధ బూత్‌లలో నమోదైన ఓటింగ్ శాతాన్ని ఖైరతాబాద్ ఎమ్మెల్యే, సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఆయన నివాసంలో అందజేశారు. డివిజన్‌లో మొత్తం 39 పోలింగ్ బూత్‌లు ఉండగా 46,040 మంది ఓటర్లకు గాను 23,172 (50.33 శాతం) ఓట్లు పోలయ్యాయని వారు నాగేందర్‌కు తెలిపారు. పంజగుట్ట ప్రతాప్‌నగర్‌లో 1284 ఓట్లకు గాను 712 ఓట్లు పోలయ్యాయని వారు తెలిపారు. పంజగుట్ట ఉప్పర్‌బస్తీ పోలింగ్ బూత్‌లో 62.96 శాతం ఓట్లు పోలైనట్లు తెలిపారు. అత్యల్పంగా నాగార్జునహిల్స్ పంజగుట్ట జర్నలిస్ట్‌కాలనీ బూత్ నెంబర్ 129లో 1106 ఓట్లకు గాను 442 ఓట్లు (39.96 శాతం) పోలయ్యాయన్నారు. నందినగర్‌లో నాలుగు పోలింగ్ బూత్‌లు ఉండగా ఇక్కడ కూడా 50 శాతం ఓట్లు పోలయ్యాయని తెలిపారు. సింగాడికుంటలో 53 శాతం ఓట్లు కొన్నిచోట్ల, 45 శాతం మరికొన్ని చోట్ల పోలయ్యాయన్నారు. దేవరకొండ బస్తీ, సింగాడికుంట, గౌరీశంకర్‌కాలనీ, దూద్‌ఖాన్‌బస్తీ, శ్రీవెంకటేశ్వరనగర్, షౌకత్‌నగర్, నందినగర్, నూర్‌నగర్, పంజగుట్ట ఉప్పర్‌బస్తీ ప్రాంతాల్లో భారీగా ఓట్లు పోలయ్యాయని, కాలనీల్లో మాత్రమే తక్కువ ఓట్లు పోలైనట్లు వారు నాగేందర్ దృష్టికి తీసుకువచ్చారు. తమకు ఎక్కడెక్కడ అనుకూలంగా ఓట్లు పడ్డాయో కూడా వివరాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

పెంపుడు కుక్క అరిచిందని..
హత్య చేయబోయారంటూ ఫిర్యాదు

వెంగళరావునగర్: పెంపుడు కుక్క అరిచిందని తన తమ్ముడితో పాటు మరదలును, కుక్కను హత్య చేయబోయారంటూ వ్యక్తి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రహమత్‌నగర్‌లో నివాసం ఉండే ఎస్.శ్రీనాథ్, అతని భార్య స్వప్నలు ఈ నెల 8వ తేదీనాడు ఉదయం పోస్టల్ బ్యాలెట్ వేయడానికి తన పెంపుడు కుక్కతో పాట ఇంటి నుంచి బయలుదేరాడు. అదే సమయంలో ఇంటి పక్కన ఉన్న వ్యక్తి వారి కుక్క రోడ్డుపై ఉన్నారు. ఆ సమయంలో వీరి కుక్క వారిని చూసి మొరిగింది. దాంతో ధనుంజయ్ అనే వ్యక్తి భార్య భర్తలను దుర్భాషలాడాడు. ఈ విషయంపై నాడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తిరిగి ఈ నెల 14వ తేదీ సాయంత్రం శ్రీనాథ్ కుక్కతో బయటకు రాగా ధనుంజయ్ అనే వ్యక్తితో పాటు నలుగురు వ్యక్తులు వచ్చి శ్రీనాథ్‌ను, అతని భార్య స్వప్నతో పాటుగా మేనల్లుడు, కోడలును, కుక్కను సైతం చంపుతామని బెదిరిస్తూ తీవ్రంగా కర్రలతో, రాడ్లతో కొట్టారు. దాంతో శ్రీనాథ్ అపస్మారకస్థితికి వెళ్లాడు. మిగిలిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాంతో శ్రీనాథ్ సోదరుడు ఎస్.మధు మధురానగర్ పీఎస్‌లో ఎల్.మధుతో పాటు మరో నలుగురిపై హత్యాయత్నం కేసు పెట్టాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు ఉచిత హెయిర్ కటింగ్

బంజారాహిల్స్: జీవితాన్ని మాతృభూమి స్వేచ్ఛకై అంకితం చేసిన మహావీరులు భగత్‌సింగ్, రాజ్‌గురులతో పాటు ఉరికంబం ఎక్కిన అమరవీరుడు సుఖ్‌దేవ్ థాపర్ జయంతిని పురస్కరించుకుని సామాజిక సేవకుడు రమేష్ కోడిప్యాల్ల ఖైరతాబాద్ గూడ దాక్టర్స్‌కాలనీలోని వృద్ధాశ్రమంలోని దివ్యాంగులకు హెయిర్ కటింగ్, షేవింగ్ చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు చుట్టుపక్కల చాలా ఆశ్రమాలు ఉన్నాయని, ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో తమవంతుగా తోడ్పాటునందించాలని రమేష్ కోరారు.

రాళ్లకు ప్రాణం పోసేలా!







మహబుబాబాద్ జిల్లా గూడూరు మండలానికి (ఉమ్మడి వరంగల్) చెందిన ఇస్లావత్ వెంకన్న ఓయూలో ఎంఏ, ఎంఈడీ, ఎంఎల్ఐఎస్సీ తదితర మూడు పీజీలు (లైబ్రరీ కోర్సు) పూర్తి చేసి వర్సిటీలోనే కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పర్యావరణ ప్రేమికుడైన వెంకన్న వృక్షాలు, జంతువులను కాపాడాలనే లక్ష్యంతో క్యాంపస్‌లో ఉన్న రాళ్లపై ఏడాదిగా పేయింటింగ్ వేస్తున్నారు. అద్భుతంగా వేస్తున్న వివిధ రకాల చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. కొన్ని రాళ్లపై వేసిన చిత్రాలు చూస్తే రాళ్లకు ప్రాణం పోశాడా.. అనిపించేలా ఉన్నాయి. జూన్ 5న జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వెంకన్న పేర్కొన్నారు. –ఉస్మానియా యూనివర్సిటీ